సాక్షి
నిజామాబాద్
సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025

నేడు సద్దుల బతుకమ్మ

పూల పండుగకు సర్వం సిద్ధమైంది. సద్దుల బతుకమ్మను సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. పూల విక్రయాలతో ఆదివారం మార్కెట్‌లో సందడి నెలకొంది. బతుకమ్మను నిమజ్జనం చేయనున్న నీటి వనరుల వద్ద అవసరమైన ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. – నిజామాబాద్ రూరల్


నిజామాబాద్ నగరంలో పూల విక్రయం..

న్యూస్‌రీల్

జిల్లా జైలు సూపరింటెండెంట్ లైంగిక వేధింపులు ?

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం మరోమారు లైంగిక వేధింపుల కేసులో ఇరుకున్నట్లు తెలుస్తుంది. గతంలో చర్లపల్లి జైలు జూనియర్ అసిస్టెంట్, ఖైదీ భార్యపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. చింతల దశరథంపై పోక్సో చట్టం కేసు నమోదు అయ్యింది. మళ్లీ కామారెడ్డి జైలులోని జూనియర్ అసిస్టెంట్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జ్యుడీషియల్ విచారణ సాగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం సెలవులో ఉన్నట్లు తెలిసింది.

సొసైటీ వైస్ చైర్మన్‌పై సస్పెన్షన్ తొలగించాలి

- హైకోర్టు స్టే ఆర్డర్

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని చింరాజ్‌పల్లి పీఏసీఎస్ సొసైటీ వైస్ చైర్మ న్ తేలు నర్సయ్యపై సస్పెన్షన్‌ను తొలగించాల ని హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. చింరాజ్‌పల్లి సొ సైటీ వైస్ చైర్మన్‌గా ఉన్న తేలు నర్సయ్య 202 1న పర్సనల్ లోన్ కింద సొసైటీ నుంచి రూ. 2.5 లక్షల రుణం తీసుకున్నాడు. ఆ తర్వాత రు ణానికి సంబంధించిన కిస్తులు చెల్లించలేదు. దీంతో వైస్ చైర్మన్ తేలు నర్సయ్యతోపాటు డై రెక్టర్లు బేగరి సుధాకర్, ఎర్రబొట్ల ముత్తెమ్మల కు ఆగస్టు 31 తేదీలోపు రుణాలను చెల్లించా లని నోటీసులు జారీచేశారు. రుణాలను కట్టకపోవడంతో సెప్టెంబర్ 3న వారిని సస్పెన్షన్ చేస్తూ పదవి నుంచి తొలగించారు. కాగా, సెప్టెంబర్ 6న నర్సయ్య తాను తీసుకున్న రుణాన్ని సొసైటీకి చెల్లించాడు.అయితే గడువులోగా చె ల్లించకపోవడంతో సస్పెన్షన్ కొనసాగించారు. దీంతో తేలు నర్సయ్య హైకోర్టును ఆశ్రయించ గా, రుణగ్రస్తుడు తన రుణాన్ని కట్టినందును తుది తీర్పు వచ్చే వరకు అతని సస్పెన్షన్‌ను ఎ త్తివేయాలని హైకోర్టు స్టే ఆర్డర్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నారీశక్తి ఎంతో గొప్పది



మోర్తాడ్: నారీ(మహిళ) శక్తి ఎంతో గొప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అన్నారు. ఆదివారం ప్రధాని మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో మోర్తాడ్‌లో ఏర్పాట్లు చేయగా, దినేశ్‌తో పాటు పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేశ్ మాట్లాడుతూ.. స్వదేశీ వస్తువులు, ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారన్నారు. అలాగే ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునేలా భారతీయ నారీశక్తి ఎదగడం గర్వకారణమని అన్నారని తెలిపారు.


సాలూర శివారులో లో లెవల్ పాత వంతెన మీదుగా ఉధృతంగా మంజీర ప్రవాహం

యంచ రైల్వే బ్రిడ్జి వద్ద పోటెత్తి ప్రవహిస్తున్న గోదావరి



నవీపేట మండలం యంచ శివారులో పంటను ముంచెత్తిన గోదావరి

ఉధృత గోదావరి

తోడైన మంజీర

- ఉప్పొంగుతున్న వరద
- మహారాష్ట్ర, సింగూరు నుంచి భారీ ఇన్‌ఫ్లో
- యంచ రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ప్రవాహం
- పరిస్థితిని పరిశీలించిన రైల్వే అధికారులు, పోలీసులు
- ఎస్సారెస్పీ ఎగువ, దిగువన నీట మునుగుతున్న పంటలు
- ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటిని ఖాళీ చేస్తున్న అధికారులు

గోదావరి గర్జించింది. మంజీర తోడవడంతో ప్రవాహం ఉధృతమైంది. రెండు నదుల పరీవాహక ప్రాంతాల్లో ఎక్కడ చూసినా నీరే. భారీ వరద వస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని ఖాళీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడా నీటి ఉధృతి తగ్గిన దాఖలాలు లేవు. బోధన్, సాలూర, రెంజల్, నవీపేట, మెండోరా మండలాల్లో పంటలు నీట మునుగుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నవీపేట మండలం యంచ రైల్వే బ్రిడ్జి వద్ద గోదావరి ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో రైళ్ల రాకపోకలు ఎప్పుడు రద్దవుతాయో తెలియని పరిస్థితి ఉంది. కందకుర్తి, బోధన్ రూరల్ మండలం ఖండ్‌గావ్ మీదుగా మహారాష్ట్రకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

నిజాంసాగర్‌లోకి..

- ఇన్‌ఫ్లో 1.30 లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 1.51 లక్షలు..

నిజాంసాగర్: ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు, హల్దీవాగు, ఘనపురం ఆనకట్టతోపాటు పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టులోకి 1.30 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 21 వరద గేట్లను ఎత్తి 1.51 లక్షల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

రైల్వే బ్రిడ్జిని తాకే అవకాశం..!

నవీపేట/ఖలీల్‌వాడి : ఉప్పొంగుతున్న గోదావరి యంచ వద్ద రైల్వే బ్రిడ్జికి మూడడుగుల మేర తక్కువ మాత్రమే ప్రవహిస్తోంది. వరద ప్రవాహం పెరిగే బ్రిడ్జీని తాకే అవకాశం ఉంది. గోదావరి ఉధృతి పెరిగే తాత్కాలికంగా రైళ్ల రాకపోకలను రద్దు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులు బ్రిడ్జిని పరిశీలించారు. అయితే మహారాష్ట్ర ప్రాంతంలో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో నిజామాబాద్ – పండరీపూర్ రైలును ఆదివారం తాత్కాలికంగా రద్దు చేశారు.

ఎస్సారెస్పీ నుంచి 4.5 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో

- ఇన్‌ఫ్లో 3.15 లక్షల క్యూసెక్కులు..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటిని గోదావరిలోకి విడుదల చేస్తుండడంతో దిగువన గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ నుంచి భారీ వరదలు వస్తున్నాయనే సమాచారం మేరకు అధికారులు ప్రాజెక్ట్ నుంచి 39 వరద గేట్ల ద్వారా 4.5 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం రాత్రి వరకు వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ నీటిని మరింత ఖాళీ చేయాలన్న ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇన్‌ఫ్లో కన్నా అవుట్ ఫ్లోను ఎక్కువ చేశారు. నది పరీవాహక ప్రాంతాలైన మెండోరా మండలం దూదిగాం, కోడిచర్ల, చాకిర్యాల్, పోచంపాడ్, సావెల్ గ్రామాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. ప్రాజెక్టు దిగువన ఉన్న వడ్డెర కాలనీలోకి భారీగా నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదలను మరింత పెంచే అవకాశం ఉండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోడిచర్ల, సావెల్ గ్రామాల మధ్య వంతెనపై నుంచి గోదావరి ప్రవహిస్తోంది. మెండోరా రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1084.40(58 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.


ఎస్సారెస్పీ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్న నీరు

రైతుల ఆగ్రహం


సాలూర శివారులో మాట్లాడుతున్న రైతులు

బోధన్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా సాలూర, బోధన్ మండలాలపరిధిలో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి నష్టపోయామని సాలూర గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాలూరలో రైతులు ఆదివారం మాట్లాడారు. వరదను అంచనా వేసి సకాలంలో అవుట్ ఫ్లోను పెంచి ఉంటే పంటలు నీట మునిగే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆగస్టు చివరి వారంలో, మళ్లీ ఇప్పుడు వేలాది ఎకరాల సోయా, వరి, ఇతర పంటలు మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

హంగర్గను చుట్టుముట్టిన నీరు

బోధన్‌రూరల్: మంజీర, శ్రీరాంసాగర్ సాగర్ బ్యాక్ వాటర్ (వరద నీరు) బోధన్ మండలంలోని హంగర్గ గ్రామాన్ని ఆదివారం మళ్లీ చుట్టుముట్టింది. గ్రామంలోనీ జీపీ భవనం వరకు వరదనీరు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ విఠల్ గ్రామానికి చేరుకుని సుమారు 700మందికి పైగా గ్రామస్తులను బస్సుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొంత మంది కొప్పర్గలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. ఖండ్‌గావ్ శివారులోని బ్రిడ్జిపైనుంచి మహారాష్ట్ర – తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.


బస్సులో తరలుతున్న గ్రామస్తులు


సోయాకు పెద్ద దెబ్బ

వరద ముంపు కారణంగా హంగర్గ, కొప్పర్గ, ఖండ్‌గావ్, భిక్‌నెల్లి, కల్దుర్కి, సిద్ధాపూర్ శివార్లలో వేలాది ఎకరాల్లో సోయా నీట మునిగింది. గత నెలలో వచ్చిన వరదల కారణంగా వేలాది ఎకరాల్లో సోయా దెబ్బతినగా ఈ సారి వరద ప్రభావంతో పూర్తి స్థాయిలో పంట నష్టపోయే పరిస్థితి తలెత్తింది.

లబోదిబోమంటున్న రైతులు

- వేలాది ఎకరాల్లో పంట నష్టం

బోధన్: సాలూర శివారులోని లోలెవల్ పాత వంతెన మీదుగా మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది. సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్, హున్సా, సాలూర గ్రామాల శివార్లలో వరి, సోయా, చెరుకు ఇతర పంటలు వేలాది ఎకరాల్లో నీట మునిగాయి. ఆగస్టు చివరి వారంలో భారీ వర్షాలు, వరద కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నీట మునగగా, ప్రస్తుతం రెండోసారి ముంపునకు గురయ్యాయి. గతంలో దెబ్బతిన్న పంటలకు మందులు పిచికారీ చేసి కొంతమేర కాపాడుకున్న రైతులకు ప్రస్తుతం కోలుకోలేని దెబ్బతగిలింది. పెట్టిన ఖర్చులు చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని లబోదిబోమంటున్నారు. మందర్నాలోని లోతట్టు ప్రాంతాలకు నీరు చేరింది. ఖాజాపూర్ అంచున ఉన్న పెద్ద వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డు, వైకుంఠధామం నీట మునిగాయి.

ఖాజాపూర్ శివారులో నీట మునిగిన పంటలు


ముంచెత్తిన వరద

రెంజల్(బోధన్): గోదావరి నెలలో నాలుగో సారి ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక గ్రామాల్లో సోయా పూర్తిగా దెబ్బతిన్నది. శనివారం శాంతించిన గోదావరి ఆదివారం పోటెత్తింది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడం, మరోవైపు నిజాంసాగర్ గేట్లు ఎత్తడంతో మంజీర కందకుర్తి వద్ద గోదావరిలో కలిసి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరక్షేత్రంలోని సీతారాం త్యాగి ఆశ్రమం వరద నీటిలో మునిగింది. అధికారులు ముందస్తుగా ఆశ్రమంలోని గోవులను శనివారం గ్రామానికి తరలించారు. గ్రామంలోని రామాలయం వరకు వరద నీరు చేరింది. అంతర్రాష్ట్ర వంతెనను దాటి అర కిలో మీటరు వరకు రోడ్డు పై నీరు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. తాడ్‌బిలోలి–బోర్గాం మధ్య వరి పూర్తిగా నీట మునిగింది. దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు ఇటీవలే రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేశారు. రెండు, మూడు రోజులు గడవక ముందే పంటలు మళ్లీ నీట మునగడంతో రైతులు లబోదిబో మంటున్నారు. వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి.


కందకుర్తి రామాలయం వద్దకు చేరిన గోదావరి నీరు

ఎవరి లెక్కలు వారివే

- రిజర్వేషన్ల ప్రకటనతో స్థానిక సంస్థల ఆశావహుల అలర్ట్
- బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టుకు వెళ్లడంతో ఉత్కంఠ
- నోటిఫికేషన్ కోసం తప్పని ఎదురుచూలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మొదటి అడుగులో భాగంగా కీలకమైన రిజర్వేషన్ల జాబితాను ప్రకటించడంతో ఆశావహులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. రిజర్వేషన్లు, మహిళల కోటా తదితర అంశాలను బట్టి జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్ పీఠాలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ టిక్కెట్ల కోసం ఎదురు చూస్తున్న వివిధ పార్టీలకు చెందిన ఆశావహులు, ముఖ్య నాయకులు తగిన విధంగా ముందుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

అయితే మరికొందరు ఆశావహులు మాత్రం తాము ఆశించిన విధంగా రిజర్వేషన్లు రాకపోవడంతో మధనపడుతున్నారు. ఇదిలా ఉండగా బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో ఉండడంతో తదుపరి పరిస్థితి ఏవిధంగా మారుతుందోనని, ఆయా సమీకరణల విషయమై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ఎంపీపీ పీఠం ఆశిస్తున్నవారు ఆయా రిజర్వేషన్ ప్రకారం తాము పోటీ ఎక్కడ చేయాలనే విషయాలపై చర్చలు చేస్తున్నారు. ఎంపీపీ పీఠాలకు సంబంధించి రిజర్వేషన్ అనుకూలంగా వచ్చినప్పటికీ ఎంపీటీసీ స్థానం రిజర్వేషన్ మారడంతో ఆశావహులు తమకు అనుకూలమైన ఇతర స్థానాన్ని ఎంపిక చేసుకునేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఆయా పార్టీల కీలక నాయకులను సంప్రదించే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎంపీటీసీ స్థానం అనుకూలంగా రిజర్వేషన్ వచ్చినప్పటికీ ఎంపీపీ స్థానం రిజర్వేషన్ అనుకూలంగా రాకపోవడంతో ఆశావహులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ బంతి కోర్టులోకి వెళ్లడంతో నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.



■ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే ఎడపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన తాజా మాజీ జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. రుద్రూర్ మండలానికి చెందిన గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన కాంగ్రెస్ నాయకుడు ఇందూరు చంద్రశేఖర్ భార్య సునీత, కోటగిరి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొట్టం మనోహర్ భార్య శారద, మోస్రా మండలానికి చెందిన పోచారం శ్రీనివాసరెడ్డి అనుచరుడైన కాంగ్రెస్ నాయకుడి భార్య, తాజా మాజీ ఎంపీపీ ఉమ జెడ్పీ పీఠం రేసులో నిలిచేందుకు ఆసక్తిగా ఉన్నారు. మరోవైపు రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ భార్య బరిలో ఉండే అవకాశముందని చర్చ జరుగుతోంది. బీజేపీ నుంచి జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ భార్య దివ్య బరిలో ఉండనున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి జగన్ భార్య బరిలో ఉంటారని అంటున్నారు. అదేవిధంగా కోటగిరికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తేళ్ల రవికుమార్ భార్య అక్షర బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

■ జిల్లా పరిషత్ పీఠం విషయంలో ఆశావహులు ప్రత్యేకంగా లెక్కలు వేసుకుంటున్నారు. జెడ్పీ పీఠం బీసీ మహిళకు కేటాయించారు. అయితే ఈ పదవిని ఆశిస్తున్న ఆశావహులు అంచనాలు, సమీకరణాలపై చర్చలు చేస్తున్నారు. తాము పోటీ చేయాలనుకున్న జెడ్పీటీసీ స్థానాలు జనరల్, జనరల్ మహిళలకు కేటాయించిన వాటిలోనూ బరిలో నిలిచి జెడ్పీ చైర్‌పర్సన్ రేసులోకి వెళ్లేందుకు పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ ఎక్కువగా ఉంది. బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి పోటీలో నిలిచేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

శ్రీశక్తి రూపిణి దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో రూ.1.52 కోట్ల నగదుతో..


అమ్మకు రూ.కోట్లతో అలంకరణ

నందిపేట్(ఆర్మూర్): శరన్నవరాత్రి ఉత్సవాలను మండల కేంద్రంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శనివారం నగదుతో అలంకరించారు. సుభాష్ నగర్ శ్రీశక్తి రూపిణి దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ. కోటి 11 లక్షలతో, పాతూర్‌లో శ్రీఓంకార రూపిణి దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో రూ. 1.11 కోట్ల నగదుతో అలంకరించారు. కరెన్సీ నోట్లతో తోరణాలు, అమ్మవార్ల మెడలో మాలలు అలంకరించారు. మండల కేంద్రానికి చెందిన వారితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించుకున్నారు.


ఓంకార రూపిణి కమిటీ ఆధ్వర్యంలో రూ.1.11 కోట్ల నగదుతో..

రిజర్వేషన్లు ప్రతిపక్షాలకు ఇష్టం లేదు

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ పనులు
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడం ప్రతిపక్ష పార్టీలకు ఇష్టం లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆరోపించారు. మండలంలోని సాంపల్లి తండాలో ఉన్న జగదాంబ దేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని ఆదివారం తన సతీమణి వినోదినితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఎన్నికల సమయంలో అమ్మవారికి మొక్కిన మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మేలయతండాలో జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని ఎండోమెంట్ ద్వారా నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల ఆశీర్వాదంతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచినానని అన్నారు. ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, సొంత స్థలంలేని వారికి ప్రభుత్వం తరుపున స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును ప్రారంభిస్తే రీ డిజైన్ పేరుతో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టును పూర్తి చేసి, పంటలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మాజీ సర్పంచులు జగదీశ్, మోహన్‌రెడ్డి, తండా పెద్దలు గోపాల్, వినోద్, మోహన్, సర్దార్, వెంగల్ రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

గుండెను కాపాడుకుందాం

వృద్ధులలోనే కాకుండా యువతలో కూడా గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో జీవనం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. కార్డియాక్ అరెస్ట్, సైలెంట్ హార్ట్ ఎటాక్.. ఏది ఏమైనా గుండెపోటుతో ప్రాణాలు పోతున్నాయి. జిల్లాలో ప్రతి నెలా సుమారు 450 మంది గుండె వైద్య నిపుణులను సంప్రదిస్తుండగా, 150 మందికిపైగా స్టంట్లు వేసుకుంటున్నారు. సుమారు 40 వరకు బైపాస్ సర్జరీలు అవుతున్నాయి. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేకం కథనం..

– నిజామాబాద్ నాగారం



- వయస్సుతో సంబంధం లేకుండా హార్ట్ఎటాక్‌లు
- మారుతున్న జీవనశైలి, మానసిక ఒత్తిళ్లూ కారణమే..
- జిల్లాలో ప్రతి నెలా వందల సంఖ్యలో బాధితులు
- నేడు వరల్డ్ హార్ట్ డే

ఒకప్పుడు వయస్సుపైబడిన వారికి ధూమ, మద్యపానం అలవాట్లు ఉన్న వారికే పరిమితమైన గుండెపోటు ఇప్పుడు అన్ని వయస్సుల వారినీ ఆందోళనకు గురిచేస్తోంది. పాతికేళ్లు నిండని వారు సైతం గుండెపోటుతో ప్రాణాలకు గురవుతున్నారు. సడెన్ సర్‌ప్రైజ్‌లకే కుప్పకూలుతున్నారంటే గుండె ఎంత బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కారణాలు ఇవే..

గుండెపోటుకు మన జీవనశైలిలో మార్పులే ప్రధాన కారణం. హోటళ్లలో బిర్యానీలు, జంక్, ఫాస్ట్‌ఫుడ్, మితిమీరిన పార్టీలు, అర్ధరాత్రి వేళల్లో నాన్‌వెజ్ తీసుకోవడం వంటివి గుండెపోటుకు కారణమవుతున్నాయి. హార్మోన్ల ప్రభావం కొంత వరకు ఉంటుంది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు పట్టుకొని గంటల తరబడి కూర్చుకునేవారు, రాత్రివేళలో నిద్రపోకుండా మేల్కొని ఉండేవారు, అతిగా ఆహారం తీసుకునేవారు, ఏ పనీచేయని వారు గుండెపోటు బారిన పడుతున్నారు. మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు గుండెపోటుకు దారితీస్తున్నాయి.

గుర్తించాలి..ఇలా..

- ఛాతి బరువుగా ఉండడం.
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- తలతిప్పడం వంటి వాటిని గుండెపోటు ప్రథమ లక్షణాలుగా భావించి వెంటనే జనరల్ ఫిజీషియన్, గుండె వైద్యనిపుణులను కలిసి చికిత్స తీసుకోవాలి.
- ఈసీజీ, 2డీకో తర్వాతే గుండె సమస్య తీవ్రత తెలుస్తుంది. ఆ తర్వాత చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

- మాంసాహారం తక్కువగా, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.
- ప్రతిరోజూ వ్యాయామం చేయాలి.
- హోటల్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉంచుకోవాలి.
- స్మోకింగ్, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి.
- గుండెజబ్బులు లేకున్నా భారీ శబ్ధాలకు దూరంగా ఉండాలి.
- స్టంట్‌లు వేసుకున్నవారు, గుండె సంబంధిత ఆపరేషన్లు చేసుకున్న వారు డీజేల వద్దకు వెళ్లొద్దు.

ప్రాణాలు కాపాడే 'సీపీఆర్'



సీపీఆర్(కార్డియోపల్మోనరీ రిససిటేషన్)పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి. గుండె కొట్టుకోవడం ఆగిన వెంటనే సీపీఆర్ చేస్తే శ్వాసక్రియ పునరుద్ధరణతోపాటు ప్రాణాలు కాపాడొచ్చు. దీనిపై పలు వైద్యులతోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే గుండెపోటుకు గురైన పదిమందిలో ఒకరు మాత్రమే సీపీఆర్ ద్వారా ప్రాణాలతో బయటపడుతున్నారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం



మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాల్సి ఉంటుంది. ఆహార నియమాలు పాటించకపోవడం, దురలవాట్ల కారణంగా ఇబ్బందులగురవుతున్నారు. మంచి అలవాట్లున్న వారికి 60 ఏళ్లు దాటినా గుండెపోటు రాదు. చెడు వ్యసనాలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. డీజేలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ సందీప్‌రావు, గుండె వైద్యనిపుణుడు

బతుకమ్మ పాట



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
పూల బతుకమ్మ ఉయ్యాలో
పండుగ బతుకమ్మ ఉయ్యాలో
అద్దాల బతుకమ్మ ఉయ్యాలో
ఆద బతుకమ్మ ఉయ్యాలో
అలంకార బతుకమ్మ ఉయ్యాలో
పూల తోరణాల బతుకమ్మ ఉయ్యాలో
గన్నేరు గజ్జల బతుకమ్మ ఉయ్యాలో
గోరింటాకు పూసిన బతుకమ్మ ఉయ్యాలో
గోదారి జలాల బతుకమ్మ ఉయ్యాలో
గోపురాల వెలుగు బతుకమ్మ ఉయ్యాలో
చెంపకూల బతుకమ్మ ఉయ్యాలో
చెరువుల కట్టేలా బతుకమ్మ ఉయ్యాలో
చిరునవ్వుల బతుకమ్మ ఉయ్యాలో
తంగేడు పూల బతుకమ్మ ఉయ్యాలో
తాళ్లచెట్టు బతుకమ్మ ఉయ్యాలో
తెలంగాణ తల్లి బతుకమ్మ ఉయ్యాలో
తల్లిదండ్రుల ఆశీర్వాద బతుకమ్మ ఉయ్యాలో
మల్లెలు ముత్యాల బతుకమ్మ ఉయ్యాలో
మట్టి వాసన బతుకమ్మ ఉయ్యాలో
బతుకమ్మ వచ్చింది ఉయ్యాలో
బతుకమ్మ గెలిచింది ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో
బతుకమ్మ జయహో ఉయ్యాలో!!

– డాక్టర్.సాహితీ వైద్య, టొరంటో కెనడా

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్
8332887332

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



బాన్సువాడ : మహిళను బెదిరించి బంగారం, నగదు దొంగిలించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెల్గాపూర్ గ్రామానికి చెందిన మేడిపల్లి లక్ష్మిని ఈ నెల 19న కొండాపూర్‌కు చెందిన నీరడి సాయిలు బాన్సువాడలోని పోచమ్మ గల్లీకి పిలిపించి ఆమె వద్ద ఉన్న రూ.50 వేల నగదు, అరతులం బంగారు హారం, సెల్‌ఫోన్‌ను బెదిరించి ఎత్తుకెళ్లాడు. బాధితురాలు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి ప్రధాన నిందితుడైన నీరడి సాయిలును తాడ్కోల్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని బుర్ర వెంకటరమణకు అమ్మినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. వెంకటరమణ వద్ద 11 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. సాయిలు, వెంకటరమణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సాయిలుపై గతంలో బాన్సువాడ, లింగంపేట్, నిజాంసాగర్, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్లు వివరించారు. కేసును ఛేదించిన సీఐ అశోక్, సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ అన్నారు.

దేశీదారు పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో మహారాష్ట్రకు చెందిన దేశీదారు పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పిట్లం మండలం బండపల్లి గ్రామానికి చెందిన మేదరి గంగారాం మహారాష్ట్ర నుంచి బైక్‌పై దేశీదారు తీసుకొస్తున్నారని సమాచారం మేరకు బిచ్కుంద బస్టాండ్ వద్ద పట్టుకొని 8 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంగారాంపై కేసు నమోదు చేశామన్నారు.

కొనసాగుతున్న అలీసాగర్ నీటి విడుదల

బోధన్: ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ గ్రామ శివారులోని అలీసాగర్ రిజర్వాయర్‌కు ఎగువ నుంచి భారీ వరద వస్తుండడంతో గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1299.6 ఫీట్లు కాగా 1297.11 ఫీట్లకు నీటి నిల్వ చేరడంతో 800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటి పారుల శాఖ ఏఈ కుషాల్ తెలిపారు. వచ్చిన వరదను వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్టీసీలో కొలువుల జాతర

- రీజియన్ పరిధిలో 110 పోస్టులు
- అక్టోబర్ 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



ఖలీల్‌వాడి: తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదలైంది. నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో మొత్తం 110 పోస్టులు ఖాళీ ఉన్నాయి. అక్టోబర్ 8 నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అభ్యర్థులు www.tgprb.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300, ఇతరులకు రూ.600, శ్రామిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.200, ఇతరులకు రూ. 400 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డ్రైవర్ పోస్టుకు రూ. 20,960 నుంచి 60,080, శ్రామిక్ పోస్టులకు రూ.16,550 నుంచి రూ.45,030 వేతనం ఇస్తారు. డ్రైవర్ పోస్టులకు 22 – 35 ఏళ్లు, శ్రామిక్ ఉద్యోగాలకు 18 – 30 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మన్‌లకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

డ్రైవర్ పోస్టులకు ఎంపిక ఇలా..

- డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నెలలకు తక్కువ కాకుండా హెవీ ప్యాసింజర్ మోటార్ వెహికిల్/హెవీ గూడ్స్ వెహికిల్/ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.
- కుల,నివాస ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, బీసీలు అయితే నాన్ క్రిమిలేయర్ పత్రం సమర్పించాలి.

రీజియన్ పరిధిలో ఖాళీల వివరాలు

జిల్లా	డ్రైవర్ పోస్టులు	శ్రామిక్ పోస్టులు
నిజామాబాద్	49	19
కామారెడ్డి	30	12

- ఎత్తు 160 సెం.మీ. కన్నా తక్కువ ఉండొద్దు.
- 100 మార్కుల్లో డ్రైవింగ్ పరీక్షకు 60, వెయిటేజీ కింద 40 మార్కులు ఇస్తారు.
- డ్రైవింగ్ పరీక్షలో 60 మార్కులకు గాను కనీసం 30 సాధించాలి. వెయిటేజీలో పదో తరగతి మార్కులు, అభ్యర్థి డ్రైవింగ్ లైసెన్సు రకం, సీనియారిటీ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.
- 100 మార్కులకు అర్హత సాధించాలంటే ఓసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారు 50 శాతం, బీసీలు 45 శాతం, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

శ్రామిక్ పోస్టులకు..

శ్రామిక్ పోస్టులను అభ్యర్థి టాలెంట్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఐటీఐల్లో వచ్చిన మార్కుల ఆధారంగా 90, నేషనల్ అప్రెంటిషిప్ ధృవీకరణ పత్రానికి 10 మార్కులు, రెండింటికి కలిపి మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఓసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 50 శాతం, బీసీలకు 45 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మార్కులు కనీస అర్హతగా నిర్ణయించారు.

పూలను పూజించడం గొప్ప సంస్కృతి



బతుకమ్మ ఆడుతున్న పోలీసు కుటుంబాలు



కుటుంబసభ్యులతో తిలకిస్తున్న కలెక్టర్, సీపీ

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య
- పోలీసు కుటుంబసభ్యుల బతుకమ్మ సంబరాలు
- పాల్గొన్న కలెక్టర్, సీపీ సతీమణులు

ఖలీల్‌వాడి: తెలంగాణలో పూలను పూజించడం గొప్ప సంస్కృతి అని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విజయలక్ష్మిగార్డెన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీసు కుటుంబాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఉత్సవాలకు కలెక్టర్, సీపీలు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని అన్నారు. పోలీసు కుటుంబసభ్యులతో బతుకమ్మ సంబురాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పోలీస్ కుటుంబసభ్యులతో కలెక్టర్, సీపీల సతీమణులు బతుకమ్మ ఆడారు. అదనపు డీసీపీ(అడ్మిన్) జి. బస్వారెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రరావు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, సీఐలు, రిజర్వ్ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య, పక్కన ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ

- జల్సాలకు అలవాటు పడిన దొంగల ముఠా
- ముగ్గురు పరారీ, ఇద్దరు అరెస్ట్
- 31 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే ముఠాకు చెందిన సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న నగరంలోని నాగారం బ్రాహ్మణకాలనీలోని పూజారి వేలేటి పవన్ శర్మ ఇంట్లో చొరబడిన దుండగులు సుమారు 33 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ. 30 వేల నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు నగరంలోని ధర్మపురిహిల్స్ డ్రైవర్స్‌కాలనీకి చెందిన షేక్‌సల్మాన్ అలియాస్ సోనూ, దొడ్డికొమురయ్య కాలనీకి చెందిన మరాఠి ఆకాశ్‌రావు నాగారంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల చౌరస్తా వద్ద ఆటోలో అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. షేక్‌సల్మాన్ అలియాస్ సోనూ వద్ద 31 తులాల బంగారం, మరాఠి ఆకాశ్‌రావు వద్ద దొంగతనానికి ఉపయోగించిన ఆటో, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరినీ విచారించగా ఐదుగురు సభ్యులు కలిసి దొంగల ముఠా ఏర్పడిందని, ముఠాకు నాయకుడు షేక్ సాదక్ అని తెలిపారు. సాదక్‌కు గంజాయి అలవాటు ఉందని, దొంగతనాలకు స్కెచ్ వేస్తాడన్నారు. వినోద్ చౌహాన్, ముక్తే సాయినాథ్, షేక్ సాదక్ కలిసి దొంగతనాలు చేస్తారని, ముగ్గురిపై నగరంలోని పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనాల కేసులు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. ఈ ముఠా జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక దొంగతనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లను సీపీ అభినందించి, రివార్డ్ అందజేశారు. సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, నార్త్ సీఐ బూస శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి ఊచలు లెక్కిస్తూ..

- వ్యవసాయ పనులు చేయడానికి వెళ్లి బ్యాంకు రుణం, టెలికాం సిమ్‌కార్డుల కేసులో నిందితునిగా అరెస్టు
- చేయని తప్పుకు జైలుపాలైన వలస కార్మికుడు



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న బాస గణేశ్ తల్లి లక్ష్మి, అక్క సంజన

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కి వెళ్లిన ఒక యువకుడు చేయని తప్పుకు జైలుపాలయ్యాడు. అకారణంగా దుబాయ్‌లోని రషీదియా పోలీసుల డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న తమ కొడుకు బాస గణేశ్‌ను విడిపించి ఇంటికి చేర్పించాలని తల్లి లక్ష్మి, అక్క సంజనలు ప్రవాసీ ప్రజావాణిలో విన్నవించారు. మోర్తాడ్‌కు చెందిన బాస గణేశ్ మూడేళ్ల కింద వ్యవసాయ పనులు చేయడానికి యూఏఈలోని అబుదాబికి వెళ్లాడు. బ్యాంకులో రుణం, టెలికాం సిమ్‌కార్డులు అక్రమంగా తీసుకున్నట్లు కేసు నమోదైందంటూ దుబాయ్ రషీదియా పోలీసులు అరెస్టు చేసి వారి ఆధీనంలోని డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉంచారు. తాను యూఏఈకి వచ్చినప్పటి నుంచి అబుదాబిలోనే ఉన్నానని దుబాయ్‌కు వెళ్లలేదని, బ్యాంకులో లోన్, టెలికాం సిమ్‌కార్డులు తీసుకోలేనని చెప్పినా పోలీసులు వినలేదని బాధితుడు తన కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. జూన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకోగా ఇప్పటి వరకు వారి ఆధీనంలోనే ఉన్నాడు. ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందించగా.. యూఏఈలోని భారత విదేశాంగ శాఖ కార్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లేఖ పంపించారు. బాస గణేశ్‌కు సంబంధించిన కేసు వివరాలను అందిస్తే న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించింది.

క్రైం కార్నర్

అప్పులబాధతో యువకుని ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

మాచారెడ్డి: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చుక్కాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అనాచి రమేశ్(32) ఇటీవల ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లతోపాటు మహిళా సంఘాల వద్ద అప్పు చేశాడు. మొత్తం రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. మూడు రోజుల కిందట ఫైనాన్షియర్లు ఇంటి విషయంలో ఎలాంటి లావాదేవీలు చేయొద్దని ఇంటికి నోటీస్ అతికించి వెళ్లారు. దీంతో ఈఎంఐలు కట్టలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొద్దిరోజులుగా భార్యా,పిల్లలతో కామారెడ్డిలో నివాసముంటున్న రమేశ్ శనివారం రాత్రి చుక్కాపూర్ వచ్చి బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మనస్తాపంతో మహిళ..

రాజంపేట: మనస్తాపంతో ఉరేసుకొని మహిళ మృతి చెందిన ఘటన రాజంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోడెంగల మల్లేశం 18 సంవత్సరాల క్రితం తన మొదటి భార్య చనిపోవడంతో సిద్దవ్వను పెళ్లి చేసుకున్నాడు. 6 నెలల క్రితం అనారోగ్యంతో మల్లేశం చనిపోవడంతో సిద్దవ్వ తరచూ మనోవేదనకు గురయ్యేది. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ఉన్న సోదరి ఇంటికి వెళ్లిన ఆమె శనివారం సాయంత్రం రాజంపేటకు వచ్చింది. రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. కుటుంబసభ్యులు ఉదయం 7 గంటల ప్రాంతంలో సిద్దవ్వ గదిని తెరిచిచూడగా దూలానికి ఉరేసుకొని కనిపించింది. సోదరుడు ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

మేనత్త అంత్యక్రియలు జరిగిన కొద్దిసేపటికే..

- ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్..
- రోడ్డు పక్కన స్కూటీపై ఉన్న వ్యక్తిపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- కోమట్‌పల్లి వాసి దుర్మరణం



రాజేంద్రప్రసాద్ మృతదేహం

డొంకేశ్వర్(ఆర్మూర్): మేనత్త అంత్యక్రియలు పూర్తిచేసిన కొద్దిసేపటికే అనుకోని ప్రమాదంలో అల్లుడు మరణించిన సంఘటన డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లిలో చోటు చేసుకుంది. కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీనోళ్ల రాజేంద్ర ప్రసాద్ (44) వ్యవసాయం చేస్తుంటాడు. ఆదివారం తన మేనత్త ఎర్రక్క చనిపోవడంతో ఆమె అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించారు. మేనత్త అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన రాజేంద్రప్రసాద్ ఇంటి బయట రోడ్డు పక్కన తన స్కూటీపై కూర్చున్నాడు. అదే సమయంలో నికాల్‌పూర్ నుంచి కోమట్‌పల్లి మీదుగా శాపూర్‌కు వెళ్తున్న ఓ టిప్పర్ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ముందుకు జరిగి స్కూటీపై ఉన్న రాజేంద్రప్రసాద్ పైకి వచ్చింది. ట్రాక్టర్ చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదాన్ని చూసిన వారంతా ఉలిక్కిపడ్డారు. మేనత్త చనిపోయిన రోజునే అల్లుడు కూడా మరణించడం అందరినీ కలచివేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



దినేశ్(ఫైల్)

వేల్పూర్: వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదుట 63 నెంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన అల్లకుంట దినేశ్(26) మరణించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దినేశ్ అతని స్నేహితులు కార్తీక్, రాజ్‌కుమార్‌తో కలిసి డ్యూక్ బైక్‌పై లక్కోర నుంచి మోర్తాడ్ వైపు వెళ్తుండగా, వేల్పూర్ ఏఎంసీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో దినేశ్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్, రాజ్‌కుమార్‌లను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన దినేశ్ సెలవుపై గత నెలలో ఇంటికి వచ్చాడు. తిరిగి గల్ఫ్ వెళ్లాల్సి ఉండగా ప్రమాదంలో చనిపోయాడు. మృతుడికి ఒక సోదరి ఉండగా, ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసెలా రోదించారు.

మహమ్మదీయకాలనీలో చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని మహమ్మదీయ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. మహమ్మద్ షకీర్ తన ఇంటికి తాళం వేసి రెండ్రోజుల క్రితం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. ఆదివారం ఇంటికి చేరుకున్న కుటుంబీకులకు తాళం పగులగొట్టబడి కనిపించింది. అనుమానంతో పరిశీలించగా బెడ్రూంలో ఉన్న తులంన్నర బంగారం, 15 గ్రాముల వెండి, రూ.1.50 లక్షలు అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భూంపల్లిలో నాలుగు ఇళ్లలో..



సదాశివ నగర్ (ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. దుండగులు బీరువాలను పగులగొట్టి వెండి, బంగారు వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన స్వప్న అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు తన భర్తతో చిన్న గొడవ కావడంతో పాపతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎక్సెల్ వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గేట్ వద్ద ఎక్సెల్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన గూల చిన్న అంజయ్య (47) నిజాంసాగర్ నుంచి నర్వకు వెళ్తుండగా, బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే అంజయ్య మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

